

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 02-04-2026 సంపుటి: 01 సంచిక : 286 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday 02-04-2026 Volume :01 Issue: 286 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## అమరావతి బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపీలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం

-మిగతా 2 లో

## బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు
# టచ్‌లో ఉన్నారు

**25న కొత్త పార్టీని ప్రకటిస్తాం.. ఆ రోజు చేరికలుండవు**



- మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మావోయిస్టులు కూడా చేరతారు
- కేసీఆర్ రావణుడైతే.. మరి శకుని ఎవరో రేవంత్ చెప్పాలి
- సీఎం బీఆర్‌ఎస్ భుజాన తుపాకీ పెట్టి పొంగులేటిని కాల్చారు: కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
రావణాసురుడు ఉండటం వల్లే రాముడికి, శకుని ఉండటం వల్లే కృష్ణుడికి గుర్తింపు దక్కిందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికరంగా స్పందించారు. కేసీఆర్‌ను రావణుడిగా చెప్పిన రేవంత్, శకుని ఎవరో మాత్రం చెప్పలేదని పేర్కొన్నారు. జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనను తాను మహాభారతంలోని బర్బరీకుడి పాత్రతో రేవంత్ పోల్చుకున్నారని, ఇది తనకు నవ్వు తెప్పిస్తోందని, బర్బరీకుడి మాదిరిగా రేవంత్ చేసిన



-మిగతా 2 లో


mee seva
easier, faster

## భారీగా పెరిగిన
# మీసేవ చార్జీలు

- రేషన్‌కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌కు రూ.80
- బర్త్ సర్టిఫికెట్ ప్రింట్, ఈసీకి రూ.62

**హైదరాబాద్, ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
రాష్ట్రంలో మీసేవ చార్జీలు భారీగా పెరిగాయి. ఇప్పటికే అన్ని విధాలుగా ధరలు పెంచిన సర్కార్ మీసేవ చార్జీలను సైతం వదలలేదు. ఇక నుంచి మీసేవ చార్జీలను భారీగా పెంచారు. దాదాపు 100 శాతం కంటే ఎక్కువగా చార్జీలు పెంచారు. బీ క్యాటగిరీ పరిధిలోని రేషన్‌కార్డు, ఆదాయం, కులం, రెసిడెన్స్, కొత్త విద్యుత్ కనెక్షన్, భూభారతి కేవైసీ వంటి వాటికి ఒకేసారి రూ. 80 పెంచారు. మొత్తం 15 రకాల సర్వీసులకు పెంచిన కొత్త చార్జీలు

-మిగతా 2 లో



## లోక్‌సభ స్థానాల పెంపుపై మోదీ సర్కారు 'బుల్డోజింగ్' యత్నం

- ఏ లెక్కన 50 శాతం చొప్పున పెంచుతారు..?
- ఇది దక్షిణాదికి నష్టం చేయడమే
- ఆ ముప్పుపై ముందే హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

**న్యూఢిల్లీ,**
ఏ లెక్కప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం ఏ లెక్కన పెంచుతారని మోదీ ప్రభుత్వాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'ఇది ముమ్మాటికీ దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేయడమే. రాబోయే ముప్పు గురించి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు' అని బుధవారం ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. 'లోక్‌సభ పరిమాణాన్ని ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్ల సంఖ్యనూ 50 శాతం పెంచేందుకు మోదీ ప్రభుత్వం ఒక బిల్లును 'బుల్‌డోజ్' (బలవంతంగా రుద్దడం) చేయాలని ప్రతిపాదిస్తోంది. ఇటువంటి చర్య దక్షిణాదితోపాటు ఈశాన్య, పశ్చిమ భారత్‌లోని చిన్న రాష్ట్రాలకు 'ప్రతికూలంగా' మారుతుంది. ఈ విషయమై విపక్షాల

-మిగతా 2 లో

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ



2 లో

## స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

- అన్నదాత అరచేతిలో 'సమీకృత భూభారతి' పోర్టల్
- నేటి నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా పోర్టల్ అమలు
- అధికారులకు పొంగులేటి దిశా నిర్దేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
రోజురోజుకు సాంకేతికత కొత్త రూపును సంతరించుకుంటోంది. గతంలో ఉన్నత విద్యావంతులకే పరిమితమైన టెక్నాలజీ ప్రస్తుతం సామాన్యులు, రైతుల అరచేతిలోనే ప్రత్యక్షమవుతోంది. ఇప్పుడు 'మీ వద్ద స్మార్ట్ ఫోన్ ఉంటే సరి.. మీ భూ వివరాలు' తెలుసుకోవచ్చు.



-మిగతా 2 లో



## లక్నోపై ఢిల్లీ క్యాపిటల్స్
# సూపర్ విక్టరీ

- అజేయ హాఫ్ సెంచరీతో సమీర్ రిజ్వీ షో
- ఓడిపోయే స్థితి నుంచి మ్యాచ్ గెలిచిన ఢిల్లీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తమ తొలి మ్యాచులో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ.. ఆరు వికెట్ల తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ ఫలితంతో ఐపీఎల్ 2026ను విజయంతో ఆరంభించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 141 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి మ్యాచ్ ముగించింది. లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో తీవ్రంగా తడబడింది. ఓపెనర్‌గా వచ్చిన పంత్ (7)తో పాటు మిగతా బ్యాటర్లు కూడా విఫలమయ్యారు. దీంతో కనీసం 20 ఓవర్లు

-మిగతా 2 లో

## తెలంగాణను దోచుకుంటున్న
# కాంగ్రెస్

**ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో దోపిడీ**

- ప్రజల పోరాటాన్ని నవ్వులపాలు చేసేలా పాలన
- రెండు రాష్ట్రాలను అన్నదమ్ముల్లా అభివృద్ధి చేసుకోవాలి
- అమరావతి అద్భుత రాజధానిగా అభివృద్ధి చెందాలి
- లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
తెలంగాణను పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో దోచుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్న లక్ష్యం నెరవేరడంలేదని, ప్రజల పోరాటాన్ని నవ్వులపాలు చేసేలా కాంగ్రెస్ పాలన సాగుతోందని అన్నారు. బుధవారం లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2026పై చర్చ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటవుతున్న సందర్భంగా.. తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన ఆ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు

-మిగతా 2 లో





# కేంద్రం మరో షాక్

- భారీగా పెరిగిన వాణిజ్య సిలిండర్ ధరలు
- రూ.195.50 మేర పెరుగుదల
- జెట్ ఫ్యూయెల్ ధరలు రెట్టింపు


**న్యూఢిల్లీ**
దేశంలో వంటగ్యాస్ కొరత ఇప్పటికీ ఉంది. ఇది చిన్న హౌటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లపై తీ ప్రభావాన్ని చూపుతోంది. కేంద్రంలో దేశంలో వంటగ్యాస్ కొరత లేదని చెప్తున్నప్పటికీ.. పరిస్థితులు మాత్రం విరుద్ధంగా ఉన్నాయి. దేశంలోని ప్రజలు, చిన్నవ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంలోని మోడీ సర్కారు మరో షాక్ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులను కారణంగా చూపుతూ.. దేశంలోని వాణిజ్య సిలిండర్ ధరలను పెంచింది. 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.195.50కు పెంచింది. దీంతో కొత్త ధరతో దేశంలో వాణిజ్య సిలిండర్ ధర రూ.2వేల మార్కును దాటింది. ఈ ధరలను ప్రభుత్వ చమురు సంస్థలు సవరించగా.. ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీలో కొత్త ధర రూ.2,078.50కు ఎగబాకింది. కోల్‌కతాలో రూ.2208.50గా, ముంబయిలో రూ.2,031గా, చెన్నైలో రూ.2246.50గా, బెంగళూరులో రూ.2161గా ధరలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,320.50కు ఎగబాకింది. డొమెస్టిక్ సిలిండర్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ లేదు.భారత్‌లో జెట్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు రెట్టింపు పెరిగి రికార్డు స్థాయికి చేరాయి. మొదటిసారిగా రూ.2 లక్షల మార్కును దాటింది. జెట్ ఫ్యూయల్ (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ -

-మిగతా 2 లో

## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

- మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు
- భారత వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్- ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం,




-మిగతా 2 లో

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

- 30వేల మంది టెక్కీల తొలగింపు
- అందులో 12వేమంది భారతియులు

**న్యూయార్క్ - ఏప్రిల్ 01 నేటి దర్శిని)**
అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది




-మిగతా 2 లో

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక సత్య శోధనే మా లక్ష్యం

# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

మొదటి తరువాయి

ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఏఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

మొదటి తరువాయి

పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# లోక్‌సభ స్థానాల పెంపుపై మోదీ సర్కారు 'బుల్డోజింగ్' యత్నం

మొదటి తరువాయి

ఆందోళనకు కేంద్రం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచడం సమానమనే వాదన మోస పూరితం. దీనివల్ల ప్రస్తుతానికి నిష్పత్తులు మారకపోవచ్చు కానీ, భవిష్యత్తులో విస్మరించలేని లోతైన పరిణామాలు ఉంటాయి. ఉదాహరణకు, ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రస్తుత 80 సీట్ల నుంచి 120కి పెరుగుతాయి. కానీ తమిళనాడు ఎంపీల బలం 39 సీట్ల నుంచి 59కే పరిమితమవుతుంది. కేరళ లోక్‌సభ సీట్లు 20 నుంచి 30కి పెరిగితే బీహార్ సీట్లు 40 నుంచి 60కి పెరుగుతాయి. మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో కేవలం 66 సీట్లు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలు ఏకంగా 200 సీట్లు పెంచుకుంటాయి' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదన అధికారికంగా బహిర్గతమైతే ఇతరులూ ఆయన్నే అనుసరిస్తారు.' అని ఆయన పేర్కొన్నారు.

# కేంద్రం మరో షాక్



మొదటి తరువాయి

– ఏటీఎఫ్) ధరలు భారీగా ఎగబాకి కిలోలీటర్‌కు రూ.2.07 లక్షలకు చేరాయి. ఇది చరిత్రలోనే అత్యధికస్థాయి పెరుగుదల. ఢిల్లీలో ఏటీఎఫ్ ధరలు రూ.1.10 లక్షలు, అంటే 114.5 శాతం పెరిగాయి. ఇలా ధరలు పెరగడం వరుసగా రెండో నెల. మార్చి 1న కూడా ధరలు 5.7 శాతం పెరిగాయి. కాగా పెరిగిన ఈ ధరల వల్ల విమానయాన సంస్థలకు భారీ భారం పడుతోంది. యుద్ధం కారణంగా కొన్ని ఎయిర్‌స్పేస్‌లు మూసివేయటంతో విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. విమాన సంస్థల ఖర్చులో సుమారు 40 శాతం వాటా ఇంధనందే ఉంటుంది.పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యంగా విమానయాన రంగం, హౌటల్ రంగం తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. కమర్షియల్ సిలిండర్‌ల కొరత ఉందనీ, దీంతో హౌటళ్లు, రెస్టారెంట్లు ధరలు పెంచుతున్నాయనీ, దాని ప్రభావం పరోక్షంగా సాధారణ ప్రజలపై పడుతోందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రస్తుతం చమురు ధరలు, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలు పెరగకపోయినా.. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణను దోచుకుంటున్న కాంగ్రెస్

మొదటి తరువాయి

తెలియజేస్తున్నట్లు చెప్పారు. అమరావతి అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 1969లో జై తెలంగాణ అన్నందుకు 369 మంది ఉద్యమకారులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపిందని, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ 1200 మంది ఆత్మబలిదానం చేశారని పేర్కొన్నారు. వారి త్యాగంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నారని తెలిపారు. బిల్లుపై చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ సభ్యులు కొందరు తెలంగాణకు విమానాశ్రయాలు లేవని చెప్పారని, ఇందుకు కారణమెవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు విమానాశ్రయాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగూడెం, వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలకు భూమి కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్డీయే ప్రభుత్వం లేఖలు రాసినా.. భూమి ఇవ్వలేదని, కనీసం స్పందించలేదని తెలిపారు. ఇప్పుడు రెండు రాష్ట్రాలను అన్నదమ్ముల్లా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందని, తెలంగాణలోనూ అభివృద్ధి పనులకు అండదండగా నిలుస్తోందని చెప్పారు.

# లక్నోపై ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ విక్టరీ

మొదటి తరువాయి

కూడా ఆ జట్టు బ్యాటింగ్ చేయలేకపోయింది. చివరకు 18.4 ఓవర్లలో 141 పరుగులకు పరిమితమైంది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. కేఎల్ రాహుల్‌ను మహమ్మద్ షమీ.. గోల్డెన్ డకౌట్ చేశాడు.కేఎల్ రాహుల్ ఔట్ అయ్యాక ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే లోపే నాలుగు వికెట్లు కోల్పోయింది. 4.3 ఓవర్లలో 24 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సమీర్ రిజ్వీ .. అసలైన ఆటతీరు కనబరిచాడు. ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.అభేద్యమైన ఐదో





వికెట్‌కు సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 రన్స్ నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 రన్స్) 76 బంతుల్లో 119 పరుగులు జోడించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 17.1 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లలో కేఎల్ రాహుల్‌తో పాటు అక్షర్ పటేల్ కూడా గోల్డెన్ డకౌట్ అయ్యాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, మహమ్మద్ షమీ 1, మోహ్సిన్ ఖాన్ 1 వికెట్ పడగొట్టారు. ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం కేకేఆర్‌తో సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.కాగా 2024లో సమీర్ రిజ్వీని చెన్నై సూపర్ కింగ్స్ భారీ ధర వెచ్చించి దక్కించుకుంది. ఫ్యూచర్ స్టార్‌గా రిజ్వీ మారతాడని అప్పుడే ధోనీ అంచనా వేశాడు. అతడి అంచనాలను నిజం చేస్తూ సమీర్ తాజా మ్యాచులో సత్తాచాటాడు.

# స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

మొదటి తరువాయి

సామాన్య రైతుల భూసమస్యల పరిష్కారానికి 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. గతంలో మాదిరిగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రైతులు 'మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదు' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇంట్లో నుంచే స్మార్ట్ ఫోన్ ద్వారా భూసేవలు పొందడానికి పోర్టల్ రూపొందించామన్నారు. అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని రైతులు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని సేవలను పొందవచ్చునని తెలిపారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పారదర్శక సేవలకు వీలుగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి రూపొందించిన 'సమీకృత భూ భారతి' పోర్టల్‌ను గురువారం (ఏప్రిల్ 2) నుంచి నారాయణపేట జిల్లా కోస్గి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం-భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే.. పోర్టల్ ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రెవెన్యూ అధికారులకు బుధవారం టెలి కాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. పోర్టల్ నిర్వహణపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ మండలాల నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మార్పులూ చేర్పులతో రెండో దశలో రాష్ట్రమంతా అమలు చేస్తామని వెల్లడించారు.

## అమరావతి బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

మొదటి తరువాయి

రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

మొదటి తరువాయి

త్యాగం ఏమిటో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఈనెల 25న కొత్త పార్టీ ప్రకటన ఉంటుందని చెప్పారు. పార్టీ ఎజెండా, ప్రజలకు ఏం చేయదల్చుకున్నామో అదేరోజు వివరిస్తామని చెప్పారు. ఆ రోజు పార్టీలో చేరికలు ఉండవని పేర్కొన్నారు. ఇప్పటికే బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారన్నారని.. వారి పేర్లు సమయం వచ్చినప్పుడు తానే వెల్లడిస్తానని చెప్పారు. మాజీ మావోయిస్టులు కూడా పార్టీలోకొచ్చి సేవలందిస్తారని పేర్కొన్నారు. కొత్తపార్టీ ప్రకటనకు ముందు ఉమాభారతి లాంటి కొందరు జాతీయస్థాయి నేతలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని వెల్లడించారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు తిట్టుకోవడానికే సమయం సరిపోయిందని, ఒకరి అవినీతిని మరొకరు బయట పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ బీఆర్ఎస్ పార్టీ భుజాన తూపాకీ పెట్టి మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డిని కాల్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుందని, ఆ మేరకు మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాటం చేస్తామని చెప్పారు. కల్వకుర్తి పరిధిలోని కుర్మిద్దలో ప్రభుత్వం పెద్ద భూస్వాములకు చెందిన వందల ఎకరాల భూములను వదిలిపెట్టి.. ఎకరం, అర ఎకరం ఉన్న పేద గిరిజనుల భూములు టీజీఐసీసీ ద్వారా లాక్కునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

**16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు**
**వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ**



న్యూఢిల్లీ, దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

## భారీగా పెరిగిన
# మీసేవ చార్జీలు


మొదటి తరువాయి

అమలవుతాయి. అలాగే పుట్టిన సర్టిఫికెట్ ప్రింట్, ఈసీ వంటి సర్వీసులకు రూ.62 పెంచారు.వీటి పరిధిలోకి మరికొన్ని సర్వీసులను వర్తింపజేస్తున్నారు. ప్రతి పేజీ స్కానింగ్ కోసం రూ.2.50 అదనంగా వసూలు చేయనున్నట్లు తెలిపారు. పెంచిన ఈసేవ కొత్త చార్జీలు ఈ నెల 1 నుంచే (బుధవారం) నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో తెలిపారు. ఇప్పటి వరకు ఈసేవ కనీస చార్జీ రూ.35 వసూలు చేసేవారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నడ్డి విరవడానికే చివరాఖరుకు మీసేవ చార్జీల పెంపును కూడా వదిలిపెట్టలేదు అని వినియోగదారులు మండిపడుతున్నారు.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

# ప్రజాపాలన సభలు సమస్యల పరిష్కార వేదికలుగా జరగాలి

**● బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**మిడ్జిల్,ఏప్రిల్ 01, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
ప్రభుత్వం ఏప్రిల్ 2న నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా మారాలని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం నేటి దర్శిని ప్రతినిధితో మాట్లాడుతూ, గతంలో ప్రజాపాలన సందర్భంగా ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు సేకరించి అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందని, అయితే అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2500 ఆర్థిక సహాయం, భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12,000, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతులకు రైతు భరోసా, పంటలకు బోనస్, మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు వంటి హామీలు ఇచ్చారని గుర్తు చేశారు.అలాగే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, తులం బంగారం, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం, ఉద్యమకారులు మరియు ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ కూలీలకు 150 రోజుల పని, రోజుకు రూ.400 కూలి వంటి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు.గ్రామీణ అభివృద్ధికి పంచాయతీ పాలన కీలకమని, అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, గ్రామ సమస్యల పరిష్కారం, పెండింగ్ హామీల అమలుపై స్పష్టమైన నిర్ణయాలు ఈ గ్రామ సభల్లో తీసుకోవాలని కోరారు.ప్రజాపాలన సభల్లో ఇప్పటివరకు అమలు చేసిన పనులను వెల్లడించి, భవిష్యత్తులో అమలు చేయాల్సిన అంశాలపై గ్రామసభ తీర్మానాలు చేయాలని ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి సూచించారు.

# బాపూజీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన.....



**ఆమనగల్లు, ఏప్రిల్ 01(నేటి దర్శిని ప్రతినిధి):**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని బాపూజీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు పలు డిమాండ్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మిక వ్యతిరేకమని ఇవి అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత తగ్గి, సంఘాల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేదరి శ్రీను, జంగయ్య, లాలయ్య, నరసింహ, చంద్రయ్య ,ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల పూర్తి సిద్ధత

**● జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్**



**మిడ్జిల్, ఏప్రిల్ 01, (నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా రేపు నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలు మరియు శోభాయాత్రల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం సర్వసిద్ధంగా ఉంది. జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో జిల్లా అంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టబడినాయి.హనుమాన్ జయంతి శోభాయాత్రలు ప్రశాంత వాతావరణంలో జరగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు. శోభాయాత్రలు పోలీసులు సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.శోభాయాత్రల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బందిపడే విధంగా పెద్ద శబ్దాలతో కూడిన డీజేలను ఏర్పాటు చేయకూడదని, అలాగే ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా వివాదాస్పద పాటలు, నినాదాలు, ప్రసంగాలు చేయరాదని హెచ్చరించారు. ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సహనంతో ప్రవర్తించాలని సూచించారు.శోభాయాత్రలు సజావుగా సాగేందుకు పోలీసులు అన్ని విధాల సహకరిస్తారని, ప్రజలు కూడా పోలీసులకు మద్దతుగా నిలవాలని కోరారు. యాత్రల సమయంలో సామాన్య ప్రజలకు, ముఖ్యంగా అంబులెన్స్ వంటి అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాజిక మాధ్యమాలలో వచ్చే రూమర్లు, అనవసర పోస్టులను నమ్మరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా రూమర్లు ప్రచారం చేస్తే అట్టి వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.హనుమాన్ జయంతి వేడుకలు జిల్లాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని, ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు పిలుపునిచ్చారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే "డయల్ 100" లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం.....

**● రెండవసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అండేకార్ యాదిలాల్...**




**ఆమనగల్లు,ఏప్రిల్ 01(నేటి దర్శిని ప్రతినిధి):**
ఆమనగల్లు జూనియర్ కోర్టులోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా బుధవారం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం హాజరయ్యారు.ఈ సందర్భంగా రెండవసారి ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అండేకార్ యాదిలాల్, ఉపాధ్యక్షుడు శేఖర్,ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్,కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ సెక్రటరీ గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్,కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్ ,సర్దార్ నాయక్, నూతన కార్యవర్గంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ నూతన కార్యవర్గ కార్యక్రమానికి సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు హాజరై పూలమాలలు, శాలువాలతో, నూతన కార్యవర్గాన్ని సన్మానించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ తనను ఆదరించి రెండవసారి గెలిపించినందుకు ఆమనగల్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అదే విధంగా నూతన కోర్టు ఏర్పాటు కోసం స్థల సేకరణ కోర్టు నూతన భవన నిర్మాణం అదేవిధంగా సీనియర్ కోర్టు షాద్నగర్ నుండి మహేశ్వరం కోర్టుకు వచ్చేటట్లు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్,వెంకట్ గౌడ్, లక్ష్మీనారాయణ,వెంకటేష్, శ్రీశైలం,మహేష్,శ్రీనివాస్, శిరీష, శైలజ, ప్రియాంక,సునీత,మమత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, సూపరిండెంట్ మురళీధర్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను.. అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**మిడ్జిల్ , ఏప్రిల్ 01, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) కీలక పాత్ర పోషిస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో బుధవారం జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన మొత్తం 179 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని, అలాంటి సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే సహాయం వారికి పెద్ద ఊరటనిస్తుందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఇలాంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం పేదల పట్ల తన నిబద్ధతను చాటుకుంటోందని, భవిష్యత్తులో కూడా మరింత మంది లబ్ధిదారులకు సహాయం అందించేందుకు చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ఏర్పాటు చేయబోయే ఆఫీసులకు ప్రభుత్వ స్థలాల పరిశీలన...

**● కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి.....**



**ఆమనగల్లు,ఏప్రిల్ 01(నేటి దర్శిని ప్రతినిధి):**
ఆమనగల్ పట్టణంలో బుధవారం పలు ప్రభుత్వ కార్యాలయాలకు 125 ఎకరాలతో కొత్తగా మంజూరు అయిన పోలీస్ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, నూతన కోర్టు భవనం, డిగ్రీ కాలేజ్ భవనం, పాలిటెక్నిక్ కాలేజీ భవనం కోసం, ఏసీపి కార్యాలయం, అగ్నిమాపక పోలీస్ స్టేషన్,స్టేడియం కోసం, డంపింగ్ యార్డ్,అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం, ప్రభుత్వ భూములను ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నరసింహ,అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, తెలుగమల్ల జగన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణ నాయక్,మానయ్య,కాలే మల్లయ్య,ఒగ్గు మహేష్, కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా, ధోని,గుద్దేటి శివ, ఫరీద్, ఖాదర్, పట్టణ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజాపాలన ఏర్పాటుకు సన్నాహాలు...!

**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1(నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా పరిధిలోని నర్సంపేట ,వర్ధన్నపేట మండలాల పరిధిలోని గ్రామాలలో, వార్డులలో ప్రజాపాలన సభలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు .ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గురువారం జిల్లాలోని 317 గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో ముఖ్యమంత్రి సందేశం తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు వెల్లడి, అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు



## పోషకాహారం ప్రయోజనాలను వివరించిన ఐసిడిఎస్ అధికారులు



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):** పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణీలు బాలింతలకు ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఛాయాదేవి ,ఆర్పి కళ్యాణి వివరించారు. ప్రగతి నివేదిక ప్రజాపాలన99లో భాగంగా వరంగల్ నగరంలోని 19వ డివిజన్ వివేకానంద కాలనీలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సరియైన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లల పోషణకు సంబంధించి ఆరోగ్యకరమైన వంటకాలు ఎలా తయారు చేయాలో తల్లులకు ప్రత్యేకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ,మహిళలు పాల్గొన్నారు

## కొత్తపేటలో వివాహానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హాజరు



**కొత్తపేట, ఏప్రిల్01 (నేటి దర్శిని):** త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లూ ఇంద్రసేనారెడ్డి కొత్తపేట డివిజన్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు వజీర్ కుమార్ గౌడ్ కుమారుడు నిశాంత్ వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గారిని శాలువాతో సత్కరించారు. వివాహ వేడుకలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వజీర్ కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసిన బీజేపీ నేతలు



**ఎల్బీనగర్, ఏప్రిల్ 01 (నేటి దర్శిని):** త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని శాలువతో ఘనంగా సత్కరించారు. గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని కలిసిన వారిలో బుచ్చిరెడ్డి, నరేష్ యాదవ్, కరాటే మాస్టర్ డాక్టర్ రాము తదితరులు ఉన్నారు.

## మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి

**వనపర్తి/ ఏప్రిల్ 01:(నేటి దర్శిని):** పెద్దమందడి మండలం,పామి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి అనారోగ్యం బాగలేనందున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని మనో ధైర్యాని కల్పించారు.ఈ కార్యక్రమంలో బి. రవిచంద్రరావు, లక్ష్మణ్ గౌడ్, నాగేందర్రావు, వడ్డే వెంకటయ్య, నాగిరెడ్డి, బొక్కలయ్య, మూర్తి, కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చిన్న మల్లయ్య, మధిర మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాస్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి నీటితో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీర్వాదలు ఇప్పగూడెం గ్రామ ప్రజలందరిపై నిండుగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మంచి మనసుతో పెద్దమ్మ తల్లిని కొలిస్తే ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ముదిరాజ్ కులస్తులకు ఆలయ సమీపంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నెల రోజులలో 10లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు . అక్కపెల్లిగూడెం క్రాస్ నుంచి సత్రంకుంట వరకు, వర్షాకాలంలోపు సిసి రోడ్డు నిర్మాణం చేస్తానని అన్నారు. ఇప్పగూడెం గ్రామానికి మొదటి విడతలో 53ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశానని, రెండవ విడతలో మరో 50ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఇప్పగూడెం గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు గ్రామస్తులందరి సహకారం ఉండలాని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాణి అనిల్, మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ కులస్తులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో చిక్కిన చైతన్యపురి ఏఎస్సై బాలయ్య

- రూ.15 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్
- కాంప్రమైజ్ కేసు క్లోజ్ చేయించేందుకు లంచం డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- కోర్టు ప్రాంగణంలో ట్రాప్ ఏర్పాటు చేసి పట్టుకున్న అధికారులు
- మహిళా వేధింపుల కేసులో లోక్ అదాలత్ పేరుతో అక్రమ డిమాండ్
- అదుపులోకి తీసుకుని ఏఎస్సైపై విచారణ ప్రారంభం




**ఎల్.బి.నగర్,ఏప్రిల్01 (నేటి దర్శిని):** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కాడు. మహిళా వేధింపుల కేసును లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం. 363/2025లో పల్లపు రాంబాబు పై మహిళా వేధింపుల కేసు నమోదు అయ్యింది. అనంతరం ఈ కేసు కాంప్రమైజ్ అయినప్పటికీ, దానిని కోర్టు ద్వారా క్లోజ్ చేయించేందుకు ఏఎస్సై బాలయ్య రూ.15 వేల లంచం కోరినట్లు సమాచారం.దీంతో బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేసి, కోర్టు ప్రాంగణంలోనే బాలయ్య లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.అనంతరం ఏఎస్సై బాలయ్యను అదుపులోకి తీసుకుని, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో మరోసారి అవినీతి అంశం చర్చనీయాంశంగా మారింది.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య



**(నేటి దర్శిని): క్యాతనపల్లి,ఏప్రిల్ 01** ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. ఏప్రిల్ 4, 2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికల దృష్ట్యా బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, ఎన్నికల వేదికలను స్థానిక ఏసీపీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఎన్నికల సజావుగా జరిగేలా వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు.చట్టం--శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ, సీఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎటువంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పరోక్ష ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ, సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్,

# గర్భిణీ స్త్రీలకు గుడ్ల పంపిణీ




**మిడ్జిల్ ఏప్రిల్ 01:( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండల పరిధిలోని పెద్దగుండ్ల తాండ గ్రామపంచాయతీ పరిధిలోని మార్లబాయి తండాలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అంగన్వాడి కేంద్రంలో కోడిగుడ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పోషకాహార లోపం నివారణకు భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, సర్పంచ్ రాజు నాయక్, ఉప సర్పంచ్ శ్రీను నాయక్, అంగన్వాడి కార్యకర్త మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి-44పై రాజాపూర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో రోడ్డు డైవర్షన్‌లపై భద్రతా సూచనలు

- జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్





**మిడ్జిల్, ఏప్రిల్ 01, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రాజాపూర్ టౌన్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారి--44పై కొత్తగా నిర్మించబడనున్న ఫ్లైఓవర్ పనులకు సంబంధించి రోడ్డు డైవర్షన్‌ల ఏర్పాటుపై జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా రహదారిపై వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో డైవర్షన్‌లను ఏర్పాటు చేయాలని ఎస్పీ గారు సూచించారు. డైవర్షన్ ప్రాంతాల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు, సిగ్నల్ లైట్లు, బ్యారికేడ్లు మరియు ఇతర సూచికలను స్పష్టంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రయాణికులు, వాహనదారులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా డైవర్షన్ మార్గాలను సురక్షితంగా, సౌకర్యవంతంగా రూపొందించాలని, అలాగే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సంస్థకు ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, రాజాపూర్ ఎస్ఐ రాజశేఖర్ మరియు కాంట్రాక్టర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలకు యువత సన్నాహాలు

- భారీ శోభాయాత్రకు సిద్ధమైన వెంకటేశ్వర నగర్ యువకులు




**చింతపల్లి, ఏప్రిల్ 1 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలం గోడకొండ్ల మాల్ వెంకటేశ్వర నగర్‌లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యువత ఐక్యంగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2 గురువారం ఉదయం శ్రీ హనుమాన్ అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను తమ్మడగొని నాగరాజు, పాలకూర్ల శివ గౌడ్, పడకంటి రవి, వీరమళ్ళ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో, వార్డు సభ్యులు పాలకూర్ల శంకర్ గౌడ్, వీరమళ్ళ శంకర్ గౌడ్, ఉడుతల వెంకటేష్ యాదవ్, వినీత్ తదితరులు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించేందుకు యువకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.వేడుకలను విజయవంతం చేయడానికి యువత సమన్వయంతో కృషి చేస్తుండగా, ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులు కూడా పూర్తి మద్దతు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమాలు గోడకొండ్ల గ్రామపంచాయతీ సర్పంచ్ కాశగోని వెంకటయ్య ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ ఖలీల్, మల్లోజు జగన్ చారి, వార్డు సభ్యులు మరియు స్థానిక వ్యాపారవేత్తల సహకారంతో నిర్వహించబడుతున్నాయి.

# అర్ధరాత్రి గొర్రెల దొంగలు హల్‌చల్

- కారు వచ్చి దొంగతనం..
- నాలుగు గొర్రెల అపహరణ
- గాలింపు ముమ్మరం: ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు

**మిడ్జిల్, ఏప్రిల్ 01: ( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండలంలోని వేముల గ్రామంలో అర్ధరాత్రి సమయంలో గొర్రెల దొంగల హల్‌చల్ కలకలం రేపింది. గ్రామానికి చెందిన బెట్టరి సత్యనారాయణ (తండ్రి: పెద్ద శంకర్) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల ప్రకారం.. మార్చి 31 రాత్రి సత్యనారాయణ తన గొర్రెలను దొడ్డిలో ఉంచి ఇంట్లో నిద్రిస్తున్నారు. రాత్రి సుమారు 11:40 గంటల సమయంలో దొడ్డిలో అనుమానాస్పద శబ్దాలు వినిపించడంతో బయటకు వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తులు TG 07 AC 3432 నంబరు గల కారులో వచ్చి గొర్రెలను ఎత్తుకెళ్తున్నట్లు గమనించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, దొంగలు ఎదురు తిరిగి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో సుమారు నాలుగు గొర్రెలు కనిపించకుండా పోయినట్లు బాధితుడు తెలిపాడు.




ఈ విషయమై ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ, “ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాము. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నాము. వాహన నంబరు ఆధారంగా నిందితులను గుర్తించే చర్యలు కొనసాగుతున్నాయి. గ్రామ పరిసరాల్లో నిఘా పెంచి, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం” అని తెలిపారు. అదేవిధంగా, గ్రామస్తులు రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు పహారా మరింత బలోపేతం చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు : ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

- అధికారులతో సమీక్షా సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వెల్లడి
- లబ్ధిదారులకు సకాలంలో రూ.5 లక్షల బిల్లులు చెల్లించాలని ఆదేశం
- అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ



**దేవరకొండ, ఏప్రిల్ 01 ( నేటి దర్శిని):** పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గల తన నివాసంలో హౌసింగ్ శాఖ అధికారులతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, లబ్ధిదారులకు అందాల్సిన బిల్లులను ఎక్కడా జాప్యం చేయకుండా సకాలంలో చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రభుత్వంలో, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత స్థలం కలిగిన పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని, తద్వారా పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. గత పదేళ్ల కాలంలో ఇళ్లు లేక ఇబ్బందులు పడ్డ నిరుపేదలకు ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తామని, ప్రతి గ్రామంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్నదే తమ ఆశయమని తెలిపారు. ఇదే క్రమంలో అవినీతిపై స్పందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఎవరూ కూడా దళారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, డీఈ నాగేందర్ గౌడ్, ఏఈలు వినోద్, విజయ్, కుమార్, లావణ్య, సందీప్ రెడ్డితో పాటు చింతపల్లి మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, సీనియర్ నాయకులు యుగేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ మరియు పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయల మోసం

- “వీరభద్ర ట్రేడింగ్” మోసం బట్టబయలు - 290 మంది బాధితులు
- నెలకు 10% వడ్డీ అంటూ ఆకర్షణ
- 290 మంది నుంచి రూ.30 కోట్ల వసూళు
- మొదట వడ్డీ చెల్లించి నమ్మకం కల్పించిన నిందితులు
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, ముగ్గురు అరెస్ట్

**నాగోల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని):** నెలకు భారీ వడ్డీ ఆశ చూపిస్తూ పెట్టుబడిదారులను వలలో వేసి కోట్ల రూపాయలు కాజేసిన మోసగాళ్లను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు 290 మంది నుంచి రూ.30 కోట్ల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, బండ్లగూడ ఆనంద్ నగర్‌కు చెందిన కిచ్చ వీరభద్రరావు (51) తన భార్య రాజ్యలక్ష్మి, సహాయకుడు వెంకట దుర్గాప్రసాద్‌తో కలిసి నాగోల్ డివిజన్ పరిధిలోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, రోడ్ నెంబర్ 13లో 2024 జూన్‌లో “వీరభద్ర ట్రేడింగ్” పేరిట కార్యాలయం ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన వారికి నెలకు రూ.10 వేల వడ్డీ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలో సుమారు 290 మంది పెట్టుబడిదారులు రూ.30 కోట్ల వరకు




పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. మొదట్లో కొంతమందికి వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కల్పించిన నిందితులు, 2025 మే నెలలో గుర్గాంలో వీరభద్రరావుపై సైబర్ క్రైమ్ కేసు నమోదు కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. అప్పుల భారంతో రూ.30 కోట్లలో రూ.15 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించి, మిగతా రూ.15 కోట్ల చెల్లింపులను నిలిపివేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జాన్ మాట్లాడుతూ, అధిక లాభాల ఆశకు లోనవకుండా పెట్టుబడులు పెట్టేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.



# ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గులతో లబ్ధిదారులలో ఆనందం...

- ఇందిరమ్మ ఇంటికి ముగ్గులు .. గ్రామానికి సౌభాగ్యం
- లింగారెడ్డి గూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్

**షాద్ నగర్, ఏప్రిల్01 (నేటి దర్శిని ప్రతినిధి):** ఇందిరమ్మ ఇంటికి ముగ్గులు గ్రామానికి సౌభాగ్యమని లింగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ ఎంసిరాజు, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ లు అన్నారు. లింగారెడ్డి గూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు వేసి శంకుస్థాపనలు చేయడం జరిగింది. లబ్ధిదారులు బీశ్వ లావణ్య భర్త బీశ్వ బలరాం, మరియు చీపిరి బిక్షపొమ్మ భర్త చీపిరి యాదయ్య లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం ద్వారా లబ్ధిదారులకు ముగ్గ వేయడం జరిగిందనీ గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేష్ గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, వీరేష్ గౌడ్, ఖదీర్, గంటెల శంకరయ్య, బోటి గూడెం శ్రీశైలం, బస్తపురం అంజయ్య, చాకలి మైసయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు..

# నానంకాల వారి పెళ్లివేడుకలు





**మిడ్జిల్, ఏప్రిల్ 01, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన పరుశవేది--మాధవి దంపతుల కుమార్తె వివాహం స్థానికంగా ఘనంగా జరిగింది. ఈ శుభవివాహానికి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి,హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ వధూవరులు ఆనందంగా, పరస్పర సహకారంతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు అభినందనలు



తెలియజేసి, సమాజంలో ఇలాంటి శుభకార్యాలు సానుకూల వాతావరణాన్ని తీసుకువస్తాయని పేర్కొన్నారు. వివాహ వేడుకకు స్థానిక నాయకులు,



కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి నెలకొల్పారు.



# మాంసం మాఫియా దందా బట్టబయలు

- చనిపోయిన మేకల మాంసం హోటళ్లకు సరఫరా
- మంగళహాట్‌లో మెరుపుదాడులు.. భారీగా కుళ్ళిన మాంసం స్వాధీనం
- రసాయనాలతో మాంసం “ఫ్రెష్”గా మార్చిన మాఫియా
- ఇతర రాష్ట్రాల నుంచి చనిపోయిన జంతువుల సేకరణ
- నలుగురు అరెస్ట్.. కీలక నిందితుడు పరారీలో
- ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

**హైదరాబాద్ ఏప్రిల్ 01 (నేటి దర్శిని స్టేట్ బ్యూరో):** హైదరాబాద్ నగరంలో మానవత్వానికే మచ్చ తెచ్చే విధంగా ఒక భయానక “డెడ్ మీట్ స్కాం” వెలుగులోకి వచ్చింది. మంగళహాట్ కేంద్రంగా ఏళ్ళుగా కొనసాగుతున్న ఈ అక్రమ మాంసం దందాపై గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, జిహెచ్ఎంసి సంయుక్తంగా చేపట్టిన మెరుపుదాడుల్లో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. గోదాముల్లో భారీగా నిల్వ చేసిన కుళ్ళిపోయిన మేకలు, గొర్రెల మాంసం దిబ్బలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 100 క్వింటాళ్లకు పైగా కుళ్ళిన మాంసం సీజ్ చేయడం ఈ దందా తీవ్రతను తెలియజేస్తోంది. తినడానికి అనర్హమైన ఈ మాంసాన్ని రసాయనాలతో శుభ్రపరచి “ఫ్రెష్”గా మార్చి నగరంలోని పలు హోటళ్లకు సరఫరా చేస్తున్న దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలక సూత్రధారిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలు, గొర్రెలను తక్కువ ధరలకు సేకరించి హైదరాబాద్‌కు తరలించి ఇక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. ఎలాంటి లైసెన్సులు లేకుండా, అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేసి విక్రయించడం ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ముప్పుగా మారింది. సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ప్రధాన నిందితుడు అఫ్రోజ్ పరారీలో ఉండటంతో అతని కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ ఘటన హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న ఇలాంటి అక్రమ దందాలపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద మాంసం విక్రయాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

# పేకాటపై చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి దాడి ఆరుగురు అరెస్ట్



**చింతపల్లి, ఏప్రిల్ 1 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్సై తన సిబ్బందితో దాడి నిర్వహించారు. నిందితుల వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.16,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

# తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు అరెస్ట్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం నిందితుల నుంచి పది లక్షల రూపాయల విలువైన 35 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 లక్షల నగదు, టీవీలు, ల్యాబ్ టాప్ లు, కెమెరాలు ,మొబైల్ ఫోన్లు, వాచ్ లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు . హనుమకొండకు చెందిన బింగిరఘు, మహమ్మద్ అసద్ ను అరెస్ట్ అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# వరంగల్ నగరంలో చైన్ స్నాచింగ్ అరెస్ట్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు చైన్ స్నాచింగ్ దొంగలను వరంగల్ సిసిఎస్, హనుమకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వరంగల్ నగరంలో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని చైను స్నాచింగ్ చేస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు కళ్యాణ సుందరం, సెల్వరాజ్ నిందితులను పోలీసులు పట్టుకున్నారు . నిందితుల నుంచి 15.20 లక్షలు విలువైన 95 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం, 2 సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# వరంగల్ జిల్లాలో 509 రేషన్ షాపుల ద్వారా 3 నెలల సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1(నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ జిల్లా పరిధిలో 509 రేషన్ షాపుల్లో 3 నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని బుధవారం లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వరంగల్ జిల్లా పరిధిలోని వర్ధన్నపేట ,నర్సంపేట, మున్సిపాలిటీల తో,పాటు వివిధ మండలాల్లోని, గ్రామాల్లోని రేషన్ షాపుల నుంచి ఏప్రిల్ ,మే, జూన్ నెలలకు గాను 16,782.804 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీకి అధికారులు నిలువలు సిద్ధం చేశారు. రేషన్ షాపులు ఉదయం8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

## మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సౌకర్య పథకం లో వరంగల్ 2 డిపో ప్రథమ స్థానం...!




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1(నేటి దర్శిని బ్యూరో)**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 9 డిపోల పరిధిలో వరంగల్ 2 డిపో మహాలక్ష్మి పథకంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం 2023 నుంచి మహిళల కోసం ఏర్పాటుచేసిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సౌకర్య పథకాన్ని వరంగల్2 డిపో 1.93 కోట్ల మంది మహిళ ప్రయాణికులు ప్రయాణించి రూ. 318.55 కోట్లు ఆదా చేసుకున్నారు. ఈ డిపో పరిధిలో లక్నవరం, మేడారం జాతర పర్యాటక ప్రాంతాలకు వచ్చి వెళ్లే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం.

## వరంగల్ నగరంలోని 66 వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహించాలి: మేయర్ సుధారాణి

- పారిశుద్ధ్య కార్మికులకు ఒంటిపూట పని విధానాన్ని అమలు చేయాలి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్1 (నేటి దర్శిని బ్యూరో):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జి డబ్ల్యూ ఎం సి పరిధిలోని 66 వార్డులలో స్థానిక కార్పొరేటర్ సహకారంతో ప్రభుత్వం సూచించిన ఎజెండా ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాలుఉన్నతాధికారులతో వార్డు సభల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్ట్యా పారిశుధ్య కార్మికులకు వంటిపూట పని విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల పూడిక తీత పనులను 15 రోజుల్లోగా పూర్తిచేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మలేరియా నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి మేలు చేసే తాటి ముంజలకు నగర ప్రజల ఆసక్తి.....!



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 ( నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ నగరంలో తాటి ముంజలు కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో గ్రామాల నుంచి తాటి ముంజలు తీసుకొని వచ్చి అమ్ముతున్నారు .తాటి ముంజలు తినడం ద్వారా ఉష్ణోగ్రతను తగ్గించే గుణము ఉందని ,వీటిలో విటమిన్లు, లవణాలు, కార్బోహైడ్లు పుష్కలంగా లభిస్తాయని , మలబద్దక నివారణకు, యాంటీ ఆక్సిడెంట్స్, ఫైటో కెమికల్స్ ,క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో ముంజలకు గిరాకీ విపరీతంగా పెరిగింది. వాహనాలపై వెళ్లేవారు ఆపుకొని ముంజలు కొనుగోలు చేసుకుని వెళు తున్నారు. గ్రామాల నుంచి ఆటోల ద్వారా ముంజ కాయలు తీసుకొని వచ్చి ఆసక్తి ఉన్నవారికి ముంజలు తీసి విక్రయించడం జరుగుతుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రజలు ముంజలు కొనుగోలు చేస్తున్నారు.

## కాకతీయ మెగాటెక్స్‌ల్ పార్కులో భూములు కోల్పోయిన బాధితులకు....

- ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):**
కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన బాధిత ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని రైతులకు రాజీవ్ కాలనీలో ఇల్లు నిర్మించి ఇస్తున్నామని, ఇళ్లకు సంబంధించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

# వరంగల్‌లో భూకంప ప్రమాదాలు వాతావరణ హెచ్చరిక వ్యవస్థలపై...

- లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 1 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లాలో శరవేగంగా విస్తరిస్తున్న పట్టణ విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి నేపథ్యంలో భూకంప సంబంధిత ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. వర్షాలు, ఉష్ణతరంగాలు, ఉరుములు,మెరుపులకు ముందస్తు హెచ్చరికలు అందించేందుకు ప్రత్యేక డాప్లర్ వెదర్ రాడార్ లేదా ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలపై వివరాలు కోరారు. వరంగల్ వంటి ఉష్ణతరంగాలు, అనియంత్రిత వర్షాలకు గురయ్యే ప్రాంతాల్లో వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యం (క్లైమేట్ రెసిలియన్స్) పెంపు, విపత్తు నిర్వహణ చర్యలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించాలన్నారు. భూకంప పరిశీలనా కేంద్రాలు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, వాతావరణ పరిశోధన కేంద్రాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం అవసరమని సూచించారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వరంగల్ జిల్లా సీస్మిక్ జోన్-II తక్కువ ప్రమాద స్థాయిలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో మైక్రోజోనేషన్ అధ్యయనాలు ఇప్పటివరకు చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం 5 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు పనిచేస్తున్నాయని వెల్లడించారు.వరంగల్‌కు ప్రత్యేక డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు ప్రణాళికలో లేదని, హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాల్లో ఉన్న ఎస్-బ్యాండ్ రాడార్లు పూర్తి కవరేజ్ ఇస్తున్నాయని పేర్కొన్నారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేస్తూ నౌకాస్ట్‌లు, మొబైల్ యాప్‌లు, అలర్ట్‌ల ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నామని తెలిపారు. వరంగల్ జిల్లాలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు, అదనపు భూకంప పరిశీలనా కేంద్రాలు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల విస్తరణ, వాతావరణ పరిశోధన కేంద్రాల ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి ఈ మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు.

# నగరంలో కల్తీ నూనె మాఫియా నిజమేనా...!






- హోటళ్లలో వాడిన నూనె సేకరించి తిరిగి మార్కెట్‌లోకి పంపే ప్రయత్నమా..!
- ఆటోలో 30 డబ్బాల నూనె తరలింపు... అనుమానంతో అడ్డుకున్న జర్నలిస్టులు
- 100కు సమాచారం... వెంటనే స్పందించిన ఉప్పల్ పోలీసులు
- "బయోడీజిల్ తయారీ కోసం" అంటూ యజమాని వివరణ
- అసలు నిజాలపై దర్యాప్తు ముమ్మరం... మరిన్ని వివరాలు త్వరలో వెలుగులోకి




**ఉప్పల్, ఏప్రిల్ 01 (నేటి దర్శిని):**
హైదరాబాద్ మహానగరంలో కల్తీ వంటనూనె దందా మరింతగా విస్తరిస్తున్నట్లు తాజాగా ఉప్పల్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న ఈ అక్రమ వ్యాపారం నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతుండటం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే, నగరంలోని వివిధ హోటళ్లలో వాడిన పాడైన వంటనూనెను సేకరించి తిరిగి మార్కెట్‌లోకి సరఫరా చేయడానికి కొందరు దందాదారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో 15 లీటర్ల సామర్థ్యం గల సుమారు 30 డబ్బాల్లో నింపిన వాడిన నూనెను ఒక ఆటో (టీ07 ఖఎ 1643)లో తరలిస్తుండగా, అటుగా వెళ్తున్న జర్నలిస్టులు అనుమానంతో ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. డబ్బాల్లో ఉన్న నూనెను పరిశీలించిన జర్నలిస్టులు, అది హోటళ్లలో వాడిన పాడైన నూనె అని గుర్తించి వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించారు. సమాచారాన్ని అందుకున్న ఉప్పల్ పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన పోలీసులు, ఈ నూనె ఎక్కడి నుంచి సేకరించబడింది, ఎక్కడికి తరలిస్తున్నారు, వెనుక ఎవరున్నారు అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఇదే సమయంలో, సంబంధిత యజమాని మాత్రం ఈ నూనెను బయోడీజిల్ తయారీ కోసం ఉపయోగిస్తున్నామని చెప్పడం గమనార్హం. అయితే, ఈ నూనెను శుద్ధి చేసినట్లు చూపించి తిరిగి మార్కెట్‌లో విక్రయించే అవకాశముందని పోలీసులు అనుమానిస్తున్నారు. వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నట్లుగా, ఇలాంటి కల్తీ నూనె వినియోగం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు సహా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. నగరంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# చికెన్ సెగతో రాష్ట్రవ్యాప్తంగా షాపుల బంద్

- రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపుల యాజమాన్యం బంద్ పిలుపు
- మార్జిన్ రేట్లు తగ్గించడంతో గిట్టుబాటు లేకపోతున్నదని వ్యాపారుల వాదన
- పెద్ద పౌల్ట్రీ కంపెనీలు ధరలు నియంత్రిస్తున్నాయని ఆరోపణలు
- చిన్న షాపులపై ఆర్థిక భారం, కార్మికుల జీతాలు చెల్లించడంలో ఇబ్బందులు
- డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక ఆందోళన కొనసాగింపు




**నల్గొండ, ఏప్రిల్ 1 (నేటి దర్శిని):**
రాష్ట్రవ్యాప్తంగా చికెన్ మార్కెట్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మార్జిన్ రేట్ల విషయంలో పౌల్ట్రీ కంపెనీల వైఖరిని నిరసిస్తూ చికెన్ షాపుల యాజమాన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. నల్లగొండ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా వ్యాపారులు రాస్తారోకోలకు దిగుతూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ వ్యాపారుల ప్రకారం, పెద్ద పౌల్ట్రీ కంపెనీలు అయిన వెంకాబ్, స్నేహ వంటి సంస్థలు కోడి పిల్లల సరఫరా నుంచి ధరల నిర్ణయం వరకు మొత్తం వ్యవస్థను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నాయి. దీంతో చిన్న వ్యాపారులకు సరైన మార్జిన్ దొరకడం లేదని వారు ఆరోపిస్తున్నారు. "ముందు కిలోకు రూ.30-35 వరకు లాభం వచ్చేది. ఇప్పుడు రూ.10 కూడా మిగలడం లేదు. షాపు రెంట్లు, కరెంట్ బిల్లులు, కార్మికుల జీతాలు---ఖశ్రీశ్రీ కలిపి మాకు భారంగా మారాయి" అని వ్యాపారులు వాపోతున్నారు. ఇంకా, చికెన్ ధరలు భారీగా పెరగడం వల్ల వినియోగదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. స్కిన్‌లెస్ చికెన్ ధరలు రూ.110 నుంచి రూ.310 వరకు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. "ముక్క ఉంటేనే ముద్ద... ఇప్పుడు ఆ ముక్కే అందుబాటులో లేకపోతోంది" అని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ కంపెనీలు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని వ్యాపారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా ఆందోళనలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. చికెన్ వ్యాపారం ఆధారంగా జీవిస్తున్న చిన్న వ్యాపారుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు.



అందంతో కట్టిపడేస్తున్న లిటిల్ హార్ట్స్ బ్యూటీ..

## రెండు భాగాలు కలిపి
# దురందర్ విడుదల
### 7.5 గంటల రన్‌టైమ్ అంటూ సోషల్ మీడియా పుకార్లు




రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ స్పై యాక్షన్ సిరీస్ 'ధురంధర్' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సంచలన వార్త వైరల్ అవుతోంది. బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల రూపాయల వసూళ్లతో ప్రభంజనం సృష్టించిన 'ధురంధర్' (పార్ట్ 1), ఇటీవల విడుదలైన 'ధురంధర్: ది రివెంజ్' (పార్ట్ 2) చిత్రాలను కలిపి ఒకే భాగంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఎడిటింగ్‌లో తొలగించిన కీలక సన్నివేశాలతో పాటు పూర్తి నిడివి గల యాక్షన్ సీక్వెన్స్‌లను జోడించి ఏకంగా 7 గంటల 30 నిమిషాల సుదీర్ఘమైన ఎక్స్‌టెండెడ్ డైరెక్టర్స్ కట్ వెర్షన్‌గా దీనిని సిద్ధం చేస్తున్నారట. హాలీవుడ్ మార్వెల్ లేదా డీసీ సినిమాలకు ఇలాంటి భారీ డైరెక్టర్స్ కట్స్ రావడం మనం చూశాం కానీ, ఒక భారతీయ సినిమాకు ఈ స్థాయిలో 7.5 గంటల సుదీర్ఘమైన స్పెషల్ స్క్రీనింగ్ ప్లాన్ చేయడం ఇదే మొదటిసారి కానుంది. ఈ భారీ విజువల్ వండర్‌ను కేవలం ప్రీమియం థియేటర్ స్క్రీన్లలో మాత్రమే ప్రదర్శించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఏప్రిల్ 5 నుంచి ఈ వెర్షన్‌ను థియేటర్‌లలో విడుదల చేయబోతున్నట్లు సమాచారం. అయితే ఈ వెర్షన్‌పై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.







## 'శ్రీనివాస మంగపురం' నుంచి నరేష్ ఫస్ట్ లుక్.. 'స్వతంత్ర బాబు'గా నవరస రాయ!

టాలీవుడ్ సీనియర్ నటుడు వీకే నరేష్ తన విలక్షణమైన నటనతో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగపురం' . మంగళవారం, ఆర్ ఎక్స్ 100 చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జయకృష్ణ ఘట్టమనేని, రాషా తడాని ఈ సినిమాతో వెండితెరకి పరిచయం కాబోతున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా నుంచి నరేష్ ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో నరేష్ 'స్వతంత్ర బాబు' అనే ఒక విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. తనదైన శైలిలో జీవితాన్ని జీవిస్తూ, ప్రతి క్షణాన్ని ఆస్వాదించే ఒక స్వతంత్రమైన వ్యక్తిత్వం ఉన్న పాత్ర ఇది అంటూ నరేష్ పాత్రను పేర్కొంది. నరేష్ కెరీర్‌లో 'మళ్ళీ పెళ్ళి', 'సమాజవరగమన' వంటి సినిమాల తర్వాత ఇది మరో ల్యాండ్‌మార్క్ రోల్ అవుతుందని మేకర్స్ చాలా నమ్మకంగా ఉన్నారు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## 'రాకాస' ప్రమోషన్స్‌లో బిజీగా నిహారిక..
### అఖిల్‌తో షార్ట్ ఫిలిం అలా ఆగిపోయింది...

మెగా కుటుంబానికి చెందిన నటి, నిర్మాత నిహారిక కొణిదెల ప్రస్తుతం తన నిర్మాణంలో వస్తున్న 'రాకాస' సినిమా ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉంది. 'కమిటీ కుర్రోళ్లు' వంటి విజయవంతమైన చిత్రానంతరం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఆమె నిర్మిస్తున్న రెండో చిత్రమిది. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఏప్రిల్ 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.ప్రచార కార్యక్రమాలన్నింటినీ తన భుజాలపై వేసుకుని ముందుకు తీసుకెళ్తున్న నిహారిక, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రారంభ రోజుల్ని గుర్తు చేసుకుంది. నాగబాబు కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె, ముందుగా బుల్లితెరపై యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమైంది. 2016లో వచ్చిన 'ఒక మనసు' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది.అయితే హీరోయిన్‌గా మారే ముందు తాను చేసిన షార్ట్ ఫిల్మ్స్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రస్తుతం హీరోగా రాణిస్తున్న విశ్వక్ సేన్‌తో కలిసి 'టర్మ్స్ అండ్ కండిషన్స్' అనే షార్ట్ ఫిల్మ్ చేయాల్సి ఉందని, కానీ అది ఒక పాటతోనే ఆగిపోయిందని తెలిపింది. అది పూర్తవ్వకపోవడం మాకు మంచిదే అయ్యింది. అప్పట్లో సోషల్ మీడియా ఇంతగా ఉండి ఉంటే, నేను అలాంటి షార్ట్ ఫిల్మ్స్ చేసేదాన్నో కాదో తెలియదు అంటూ నవ్వుతూ చెప్పింది. అలాగే అఖిల్ అక్కినేనితో కలిసి చేసిన మరో షార్ట్ ఫిల్మ్ గురించి కూడా ప్రస్తావించింది. దానికి ఎస్.ఎస్. కార్తికేయ దర్శకత్వం వహించగా, ఆ షార్ట్ ఫిల్మ్‌ను దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి చూపించగా, "ఇది రిలీజ్ చేయకపోతే బెటర్" అని చెప్పారని వెల్లడించింది. అది తన మొదటి షార్ట్ ఫిల్మ్ అని, ఆ సమయంలో యాక్టింగ్‌పై ఉన్న ప్యాషన్‌తో ఏది వచ్చినా చేసేదాన్నని తెలిపింది.విశ్వక్ సేన్‌తో తన పరిచయం గురించి చెబుతూ, ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా ఆ షార్ట్ ఫిల్మ్ అవకాశం వచ్చిందని చెప్పింది. ఆ సమయంలో ఎలాంటి ప్రెషర్ లేకుండా, ఫ్రీగా ఎంజాయ్ చేస్తూ పని చేసేవాళ్లం. ఇప్పుడు చూస్తే అవి కాస్త క్రింజ్‌గా అనిపిస్తాయి కానీ, అప్పట్లో చాలా ఫన్‌గా అనిపించేది అని చెప్పింది. ఇక 'రాకాస' సినిమాపై నిహారిక భారీ ఆశలు పెట్టుకుంది. ఫాంటసీ, కామెడీ, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తోంది. నిర్మాతగా తన ప్రయాణంలో మరో విజయాన్ని నమోదు చేయాలని నిహారిక ఆశిస్తోంది.

## విశ్రాంతి కోసం విదేశాలకు ప్రభాస్



టాలీవుడ్ డార్లింగ్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వరుస షూటింగ్‌ల నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ప్రభాస్ తన తదుపరి చిత్రాలపై మరింత జాగ్రత్తగా, పూర్తి ఫోకస్‌తో పని చేస్తున్నారు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న డార్లింగ్, కొద్ది రోజులు విశ్రాంతి అవ్వడానికి వెకేషన్‌కు రెడీ అయ్యారు. నిర్విరామంగా షూటింగ్స్‌లో పాల్గొంటున్న ఈ పాన్ ఇండియా స్టార్, వేసవి సెలవుల కోసం ఇటలీకి బయలుదేరారు. తాజాగా బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఇటలీకి పయనమయ్యారు. అక్కడ కొద్ది రోజులు ప్రశాంతంగా గడిపిన తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విరామం తర్వాత ఆయన నేరుగా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే రేంజ్‌లో ఉన్న సినిమాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ అందులో ఒకటి. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న చిత్రం స్పిరిట్. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కల్కి సీక్వెల్ షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ప్రభాస్ వెకేషన్ నుంచి రాగానే కీలక షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని టాక్. బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' ఫలితం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, రాబోయే సినిమాల లైనప్ చూస్తుంటే డార్లింగ్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## జనం మనసులో నిలిచే సినిమా



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న భావోద్వేగ ప్రేమకథ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకుడు. బ్లాక్‌బస్టర్ 'బేబీ' మేకర్స్ సాయిరాజేష్, ఎస్‌కేఎన్ నిర్మాతలు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో 'గుర్తుందా..' అంటూ సాగే ఓ పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'సాయిరాజేష్ ఈ కథ చెప్పినప్పుడే ఇది బలంగా జనం మనసుల్లో నిలిచిపోయే సినిమా అని అర్థమైంది.ముఖ్యంగా మణిశర్మ ఇచ్చిన ఏడు పాటల్నీ థియేటర్లలో సెలబ్రేట్ చేసుకుంటారు' అని నమ్మకంగా చెప్పారు. ఏదో చిన్న సినిమా చేసుకుందాం అనుకున్న తనతో ఇంతటి ఎమోషనల్ మూవీని డైరెక్ట్ చేయించిన నిర్మాతలు సాయిరాజేష్, ఎస్‌కేఎన్‌లకు కృతజ్ఞతలని దర్శకుడు రవి నంబూరి అన్నారు. తన కథను తాను అనుకున్న దానికంటే అద్భుతంగా దర్శకుడు రవి నంబూరి తెరకెక్కించాడని, తను ఎంతటి ప్రతిభావంతుడో ఈ సినిమా చెప్పబోతోందని కథారచయిత, నిర్మాత సాయిరాజేష్ అన్నారు. ఇంకా నిర్మాత ఎస్‌కేఎన్, సంగీత దర్శకుడు మణిశర్మ , నిర్మాత ధీరజ్ మొగిలినేని కూడా మాట్లాడారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365